## "అస్తినాస్తుల విధము తెలియండీ!"

ఉన్నావా? అసలున్నావా? ఉంటే, కళ్ళు మూసుకున్నావా? అని రేడియోలోంచి వస్తోంది పాట.

"విన్నావా? సినిమాథింకర్స్ కూడా దేవుణ్ణి, ఉన్నావా లేవా అని ప్రశ్నిస్తున్నారు!" అన్నాడు మా తమ్ముడు.

"కష్టంలో వున్న ప్రతి మానవుడికీ గుర్తు వచ్చేది దేవుడే. అది ఉన్నావా లేవా అన్న ప్రశ్నకాదు. వచ్చి నన్ను ఆదుకోవోయ్ దేవుడా! అని ఆక్రోశన మాత్రమే" అన్నాను.

"ఇంతకీ నువ్వు మీటింగ్‌కి రానంటావు" అన్నాడు మా తమ్ముడు, కుర్చీలోంచి లేచి.

నేను చిరునవ్వు నవ్వాను. వాడు లేచి వెళ్ళాడు.

ఊళ్ళో నాస్తిక మహాసభ జరుగుతోంది. ఈ సాయంకాలం మా వాడు అందులో మాట్లాడతాడు. వీడేకాదు, ఒక ప్రముఖ డాక్టరు, ఒక మహా యాక్టరు అంతకంటే మహోన్నతుడైన కవి, ఇద్దరు యూనివర్శిటీ

ప్రొఫెసర్లు, ఒక మార్కిస్టు లీడరు వగైరా దేవుడు లేడని ఆ సాయం కాలం మా వూరి ప్రజలకి (నచ్చ) చెప్పడానికి కంకణాలు కట్టు కొన్నారు; వేదిక కట్టించుకొన్నారు.

మా తమ్ముడు పెద్ద సైంటిస్టు. అదేదో సంస్థ వాణ్ణి విదేశాలకు పంపింది. అమెరికా వెళ్ళి డాలర్లు తెచ్చుకున్నాడు. జర్మనీ వెళ్ళి మరిన్ని మార్కులు సంపాదించుకొచ్చాడు. అవన్నీ పోసి టవున్ ప్లానింగ్ వాళ్ళ లేఔట్‌లో నగరం నడిబొడ్డున ఫస్టుక్లాసయిన సైటు సంపాదించాడు. 'చేతక్' స్కూటరు కొనుక్కొన్నాడు. 'అంతా ఆ దేవుడి దయ' అంటుంది మా మరదలు. 'ఆ మాటన్నావంటే డైవోర్సు యిచ్చేస్తాను' అంటాడు మా తమ్ముడు. దేవుడు లేడని ఆవిడతో వాదించ లేక పబ్లిక్ మీటింగ్సులో మాట్లాడ్డం అలవాటు చేసుకున్నాడు.

వాడు వెళ్ళిన అరగంటకి నేను బయల్దేరాను. అక్కడ మాట్లాడ బోతున్న వాళ్ళందర్లోకి మా తమ్ముడే నికార్సయిన నాస్తికవాది. డాక్టర్‌గారు నాకొట్టే తెలియదుగాని, ఏక్టర్‌గారు మాత్రం తన ప్రతి నాటక, నాటిక ప్రదర్శనకీ ముందు "శుక్లాం"- "బరధరం" విఘ్నం అంటూ ప్రార్థన చెయ్యడం ఎరుగుదును. ఇక కవిగారు మొదటి భార్యతో పుణ్యక్షేత్రాలు సందర్శించినట్టూ సత్యనారాయణ వ్రతాలు చేసినట్టూ దాఖలాలు లేవుగాని, రెండో ఆవిడతో తిరుపతి వెళ్ళి ఊర్ధ్వ పుండ్రాలూ గట్రా ధరించి, ప్రసాదం కళ్ళకద్దుకొని ఆరగించడం నేను స్వయంగా చూసేను. వాళ్ళందరూ మంచి స్పీకర్లు అన్నది నిర్వివాదాంశం.

నేను వెళ్ళేసరికి డాక్టరుగారు మాట్లాడడం అయిపోయినట్టుంది. "నాకు రాత్రి ఏడుగంటల నుంచి డ్యూటీ వుంది. టైముకి డ్యూటీకి వెళ్ళకపోతే నన్ను ఏ దేవుడూ రక్షించడు!" అని ఛలోక్తి విసిరి దిగి పోయారాయన.

ఆ తరువాత అరగంటకి మరో యిద్దరు స్పీకర్లయ్యారు. కవి గారు మాట్లాడాక మా తమ్ముడుట.

కవిగారు లేచి నుంచున్నారు.

మంచి వూపుతో, దేవుడి భజనలప్పుడు లభ్యమయ్యేలాంటి తాళ ప్రతిపత్తితో వుంటుందని, ఆయన కవిత్వం నా కిష్టం.

సరిగ్గా ఆ సమయానికి ఇక్కడి మైకులు మూర్ఛపోయేటంత శబ్దంతో, పక్కరోడ్డు మీద ఏదో వూరేగింపు; బాజాలూ బ్యాండ్ మేళం చాలవన్నట్టు లౌడ్ స్పీకర్‌లో రికార్డు సంగీతం. కవిగారు మైక్ పట్టు కునే వేళకి, ఆయనగారు ఏదో సినిమాకి రాసిన దైవభక్తి గీతం అట్ట హాసంగా వినిపించసాగింది.

అదేం ఖర్మమో; సినిమా పాటల ట్యూనులు దేనికి బాగున్నా దేనికి బాగులేకపోయినా, భక్తి గీతాలకి మాత్రం మహా పకడ్బందీగా కుదిరి వూరుకుంటాయి.

గ్యాస్‌లైట్లతో, బండ్లమీద అమర్చిన సీతారామ లక్ష్మణుల రంగుల విగ్రహాలతో వెనకా ముందూ వేలకొద్ది జనంతో సాగుతున్న ఆ దేవుడి వూరేగింపు చూడ్డానికి సభలో మూడువంతుల మంది ఉన్న పళంగా లేచి వెళ్ళిపోయారు. "శ్రీరామనవమి ఉత్సవాల అణుపు!" అనుకుంటూనూ.

తన పాట తనకే దెబ్బకొట్టినట్టు, కవిగారు మైకు పట్టుకుని అలా వుండిపోయారు.

"ఏమిటండీ అలా వెళ్ళిపోతున్నారు?" అన్నాను, బాగా చదువు కున్నట్టు కనిపించిన ఒకాయనతో.

"దేవుడు లేడని రుజువు చెయ్యడం కన్నా, ఉన్నాడని నమ్మించడం తేలిక సుమండీ" అన్నాడాయన.

(28-4-79)